క్లుప్తంగా

పుస్తక పఠనం అలవరచుకోవాలి

అట్లూరు : విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకోవాలని అట్లూరు గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. గ్రంథాలయాల వారోత్సవాలలో భాగంగా బుధవారం అట్లూరు గ్రంథాలయంలో పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అట్లూరు సర్పంచ్ ఎల్లమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల నిరసన

ప్రొద్దుటూరు : ప్రభుత్వం పాత విధానాన్ని అమలు చేయాలని దస్తావేజు లేఖరులు రెండో రోజు బుధవారం స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు మాట్లాడుతూ దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు ఈ వృత్తిపై రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మందికిపైగా ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 విధానం వల్ల చాలా మంది రోడ్డున పడతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానంపై పునరాలోచించి పాతరిజిస్ట్రేషన్ విధానాన్నే అమలు చేయాలని కోరారు.

30న ఇంటర్వ్యూ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్ల నియామకం కోసం ఈ నెల 30న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తపాలా సూపరింటెండెంట్ రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై 18 నుంచి 50 ఏళ్ల వయసు గల నిరుద్యోగులు, స్వయం ఉపాధి గలవారు, అంగన్‌వాడీ వర్కర్‌లు, విశ్రాంత ఉద్యోగులు తదితరులు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు తపాలా జీవిత బీమా డెవలప్‌మెంట్ ఆఫీసర్ సత్యనారాయణ సెల్ నంబర్ 8498977463 సంప్రదించాలని కోరారు.

పాఠశాలల పరిశీలన

బ్రహ్మంగారిమఠం : విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందాయా లేదా అని బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలను ఏపీ పాఠ్యపుస్తక ముద్రాలయం సంచాలకులు రవీంద్రానాథ్‌రెడ్డి పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యపుస్తకాలు, విద్యార్థులు ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలన్నారు. ప్రభుత్వం విద్యకోసం ఎన్నో పథకాలు అమలు పరుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష పథక సీఎంఓ కొండా దశరధరామిరెడ్డి, జిల్లా ప్రభుత్వ బుక్స్‌డిపో మేనేజర్ రామానుజాదేవి, ఎంఈఓ2 వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో క్రమశిక్షణ

మైదుకూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మైదుకూరు గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొన్నారు. పుస్తక పఠనం చేశారు. పుస్తక పఠనం మంచి క్రమశిక్షణతో కూడిన వ్యక్తులుగా తీర్చిదిద్దుతుందని ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకుడు సందీప్ పేర్కొన్నారు. మండలంలోని వనిపెంట గ్రంథాలయంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పార్వతి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పుస్తక ప్రదర్శనలో పాల్గొని పుస్తక పఠనం చేశారు.

వ్యాసరచన పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వివిధ పోటీలను నిర్వహించారు. 6, 7 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు, 8, 9 తరగతుల విద్యార్థులకు పచ్చదనం పరిశుభ్రత అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు, 10వ తరగతి విద్యార్థులకు మీకు నచ్చిన నీతి కథ అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తకప్రదర్శన

రాజుపాళెం : రాజుపాళెం గ్రంథాలయంలో బుధవారం పుస్తకప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశామని గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు తెలిపారు.

నేడు సమావేశం

చాపాడు: ఈ నెల 20న మైదుకూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రపై గురువారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం కానున్నట్లు ఎంపీపీ లక్షుమయ్య తెలిపారు. చాపాడులో మండల పరిషత్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

ఎమ్మెల్యేకు జర్నలిస్టుల వినతి

ప్రొద్దుటూరు క్రైం : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో కొన్ని సవరణలు చేయాలని కోరుతూ ప్రొద్దుటూరు జర్నలిస్టులు బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. జీవోలో ఉన్న కొన్ని నిబంధనల కారణంగా అధికశాతం జర్నలిస్టులకు లబ్ధి చేకూరదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. జీవోలో సవరణ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే రాచమల్లు జర్నలిస్టులకు హామీ ఇచ్చారు.

వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పాలన

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



అట్లూరు : తంబళ్లగొంది సచివాలయం పరిధిలో జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శీలంవారిపల్లె సచివాలయం ఆవరణలో బుధవారం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయం పరిధిలోని ఆయా కుటుంబాలకు గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష ప్రయోజనాల కింద చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. అనంతరం సచివాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోవు ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి పుస్తకాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు కౌన్సిలర్ వరలక్ష వార్డు ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, నరసింహులు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

అట్లూరు : అహర్నిశలూ ప్రజల సంక్షేమం కోరే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా పేర్కొన్నారు. మండల పరిధిలోని తంబళ్లగొంది సచివాలయ పరిధిలో బుధవారం సాయంత్రం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత సచివాలయ పరిధిలోని కుటుంబాలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రొండా మల్లికార్జునరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మణ్యం మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షులు మణ్యం వెంకటరెడ్డి, రాజోలు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలికి అనూహ్య స్పందన

గోపవరం : మండలంలోని కాలువపల్లె సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గోపవరం మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పుల్లయ్యలు సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి 2024 ఎన్నికల్లో అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజేశ్వరి, పార్టీ నాయకులు శ్రీరాములు, మల్లేషు, రామిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే జగన్ రావాలి

కలసపాడు : సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు ఏపీకి జగన్ కావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సగిలి సుదర్శన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాజుపాలెంలో గ్రామ సచివాలయంలో ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎ.భాస్కర్‌రెడ్డి, ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ పోకలరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అందరి సంక్షేమం కోసం మళ్లీ జగనే రావాలి



మాట్లాడుతున్న నియోజవర్గ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్ర

మైదుకూరు : రాష్ట్రంలోని అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అన్నారు. బుధవారం పట్టణంలోని 10, 11 వార్డుల పరిధిలోని 6వ సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్ర మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలలో 95 శాతం నెరవేర్చారని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పరమేశ్వర్‌రెడ్డి, ఏఈ విశ్వవిహారి, అధికారి సుబ్బరాయుడు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర సచివాలయం పరిధిలో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పిల్లి ఇందిరా రమణ,ఇ ఇన్‌చార్జి పిల్లి నాగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, పదో వార్డు ఇన్‌చార్జి తవ్వా ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చేసిన మంచిని వివరించాలి

చాపాడు: గ్రామ వలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వివరించాలని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా కోట్లాది రూపాయలతో ఖర్చుతో సంక్షేమ పథకాలు అందిస్తూనే గ్రామాల్లో అభివృద్ధి చేపట్టారన్నారు. అనంతరం సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ప్రదర్శించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ కిషోర్‌రెడ్డి కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే జగనే రావాలి

దువ్వూరు : ప్రజలకు సంక్షేమ పథకాలు కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే రావాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం చింతకుంట సచివాలయం–2లో ఆంధ్రపదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని నాయకులందరూ ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఎంపీపీ ఆవిష్కరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను పార్టీ నేతలతో కలసి ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ శంకర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చికారి బాషా, ఎంపీటీసీలు ప్రతాప్‌రెడ్డి, ఖాదర్‌బాషా, నాయకులు కోగటం వీరారెడ్డి, లింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి నిరుపేదకు ప్రభుత్వ పథకాలు

బ్రహ్మంగారిమఠం : ప్రతి నిరుపేదకు ప్రభుత్వ పథకాలు అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త శెట్టిపల్లె నాగిరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రేకలకుంటలో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల కన్వీనర్ మేకల రత్నకుమార్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు సంక్షేమ పథకాల ద్వారా నిధులను వారి ఖాతాలలో జమచేస్తోందన్నారు. ప్రజలు తిరిగి జగనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, సచివాలయాల కన్వీనర్ కూన పులి రాజానాయుడు, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, నాయకులు చక్రపాని, వెంకటయ్య, లక్ష్మిరెడ్డి, గురప్ప, వెంకటేశ్, మాజీ మండల ఉపాధ్యక్షుడు భూతప్పనాయుడు పాల్గొన్నారు.

ప్రజల క్షేమం కోరే సీఎంను గెలిపించుకుందాం

ఖాజీపేట : ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడే సీఎం జగన్‌ను అందరం కలసికట్టుగా గెలిపించుకోవాలని ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. ఖాజీపేట –1 సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ అంశం పై ప్రత్యేక సమావేశం జరిగింది. సచివాలయ పరిధిలో వచ్చిన సంక్షేమ ఫలాల బోర్డును ఆయన ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను ఎంపీపీ అబుకర్ సిద్ధిక్, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. జిల్లాపరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సచివాలయాల కన్వినర్ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ రాణెమ్మ, ఉపమండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్ పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధి చెప్పడానికే గ్రామాలకు వస్తున్నాం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



గోపవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : గత నాలుగున్నరేళ్ల కాలంలో గ్రామాలకు ఏమేం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామో ప్రజలకు వివరించి చెప్పడానికే గ్రామాలకు వస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోపవరం గ్రామంలో బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ గతంలో పాలకులు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్ల కోసం వచ్చే సంస్కృతి ఉండేదన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి రెండు మూడు నెలలకోమారు ఏదో ఒక కార్యక్రమం పేరుతో ప్రజల వద్దకు పంపుతున్నారన్నారు. గ్రామంలోని ఎన్ని ఇళ్లకు ఏఏ పథకాలు మంజూరయ్యాయి, గ్రామానికి జరిగిన అభివృద్ధిని అంకెలతో సహా ప్రచురిస్తున్నామన్నారు. మనసు పెట్టి బోర్డు వైపు చూస్తే మీ గ్రామానికి జరిగిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. గోపవరం గ్రామానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.28,35,83,169 మంజూరైందని ఎమ్మెల్యే వివరించారు. మరో రెండు కోట్ల 10 లక్షల రూపాయలతో రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. ఇక్కడే ఉన్న ప్రభుత్వ పాఠశాల గతంలో ఏవిధంగా ఉండేది, ఈ ప్రభుత్వం ఎలా చేసిందో కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్ద మోష, వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఓబయ్య యాదవ్, మాజీ సర్పంచ్ దేవీప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ గాలిపోతుల సుదర్శన్, ఎమ్మార్పీఎస్ నాయకుడు లక్షుమయ్య మాదిగ, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కొండయ్య, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే ముఖ్యమంత్రి లక్ష్యం

అట్లూరు : రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. కుంభగిరి సచివాలయ పరిధిలోని గుజ్జలవారిపల్లి, జి.కొత్తపల్లి గ్రామాలలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రొండా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మణ్యంమల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

19న యూటీఎఫ్ సమావేశం

మైదుకూరు : ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) రెండవ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సంఘం జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్ కోరారు. సమావేశం కరపత్రాలను బుధవారం మండలంలోని వనిపెంటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కడప యూటీఎఫ్ భవన్‌లో 19వ తేదీ సంఘం ద్వితీయ జిల్లా కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మొహిద్దీన్ ఖాన్, విజయ్ కుమార్, మహబూబ్ బాషా, వనమాల రాము, జబ్బార్, సురేష్, గురివిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీయూ నాయకులకు సన్మానం

పోరుమామిళ్ల : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయు) పోరుమామిళ్ల మండల శాఖలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా, ఆర్థిక కార్యదర్శిగా పని చేసి సంఘ బలోపేతానికి కృషి చేసిన జయరామిరెడ్డి, శ్రీనివాసులు, అబ్దుల్‌హుసేన్‌లను బుధవారం సన్మానించారు. పోరుమామిళ్ల మండల నూతన అధ్యక్షుడు పుల్లయ్య అధ్యక్షతన రీజనల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

బ్రహ్మంగారిమఠం : మండలంలో రెవెన్యూపరంగా ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని బద్వేల్ ఆర్డీఓ ఆకుల వెంకటరమణ అధికారులను ఆదేశించారు. బుధవారం బి.మఠం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మట్లాడుతూ మండలంలో అధికంగా రెవెన్యూ సమస్యలపై ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. వీఆర్‌ఓలు నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి, అటువంటి వీఆర్‌ఓలపై తక్షణం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి చిన్న విషయం కోసం బద్వేల్ ఆర్డీఓ కార్యాలయం వద్దకు ప్రజలు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణాదేవి, కార్యాలయం సిబ్బంది, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారులకు శిక్షణ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రాంతీయ పశువైద్యశాలలో బుధవారం ఏడీఏ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గొర్రెల పెంపకందారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన సహాయ సంచాలకుడు డాక్టర్ రామసుబ్బారెడ్డి, డాక్టర్ జానకి పాల్గొని సన్నజీవాలలో మెరుగైన యాజమాన్య పద్ధతులు, మేలుజాతి జీవాల ఎంపిక, విత్తనపు పొట్టేలు ప్రాధాన్యత, చూడి గొర్రెల పెంపకం, షెడ్డు ఆవశ్యకత గురించి వివరించారు. చిన్న పిల్లల్లో మరణ శాతాన్ని తగ్గించడం, నట్టల నివారణ, టీకాల ఆవశ్యకత, పశుగ్రాసం పెంచడం, మేపు పద్ధతులపై గొర్రెల యజమానులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణకు పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు మండలాల గొర్రెల యజమానులు, పశువైద్యులు వెంకటేశ్వరరావు, రామారావు, శివశ్రీనివాసులరెడ్డి, చెన్నారెడ్డి, అశోక్, మహేశ్వరరెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులందరూ లక్ష్యంతో చదవాలి

చాపాడు : విద్యార్థులందరూ ఒక లక్ష్యాన్ని కల్పించుకుని చదవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు శివానందరెడ్డి అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో రూ.10 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం మానవతా విలువలపై చైతన్య దస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.శివానందరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి ప్రత్యేకమైన వారని ప్రతి ఒక్కరూ సమానమైన శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటారన్నారు. వారిలో సామర్థ్యాని వెలికి తీసే బాధ్యత విద్యార్థులదేనన్నారు అనంతరం చదువులో క్రమ శిక్షణలో ఆటల్లో మంచి ప్రతిభ కలిగిన రాజేశ్వరీ అనే బాలికను బెస్ట్ స్టూడెంటుగా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయిని హసీనాను బెస్ట్ టీచర్‌గా మెమెంటో, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో కస్తూర్బా స్పెషలాఫీసర్ నాగలక్షుమ్మ, వివేకానంద సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, టి.వెంకటసురేష్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గోపవరం : పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాహ్మణపల్లె సర్పంచ్ కలువాయి లక్ష్మిదేవి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లెలో రాచపూడి నాగభూషణం ఫార్మర్స్ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి సౌజన్యంతో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు పశువైద్యాధికారులు డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ క్రిష్ణవేణి, డాక్టర్ శిరీషలు పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

హెల్త్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌పై అవగాహన

కలసపాడు : కలసపాడులోని సెయింట్ ఆంటోనీస్ ఉన్నత పాఠశాలలో బుధవారం మదర్‌థెరిసా ఫౌండేషన్, ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థల ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించారు. బాలికలకు మెన్స్ట్రుపీడియాకామిక్ అనే పుస్తకాన్ని అందజేశారు. ఫౌండేషన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ చిత్తా మేరిప్రజ్వలారెడ్డి పాల్గొన్నారు.

వర్గీకరణ పేరుతో చిచ్చు

ప్రొద్దుటూరు : ఎస్సీ వర్గీకరణ పేరుతో అన్నదమ్ముల్లాంటి మాల మాదిగల మధ్య కేంద్ర ప్రభుత్వం చిచ్చు పెడుతోందని ఏపీ రాష్ట్ర మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు జేష్టాది భాస్కర్ అన్నారు. బుధవారం ప్రొద్దుటూరులో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఎన్నికల్లో ఓట్ల కోసం మాల, మాదిగ సోదరులను విడదీసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూడెం చెరువు సంపత్, మాల మహానాడు చెన్నయ్య వర్గం జిల్లా అధ్యక్షుడు సాత్రి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల : విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విశ్రాంత డీఎంహెచ్‌ఓ డాక్టర్ మార్కారెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం లైబ్రేరియన్ ఆఫ్రిదితో కలసి ఓఎల్‌ఎఫ్ బాలికోన్నత పాఠశాల, రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు చదవటం వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరించారు.

రెడ్డికొట్టాల విద్యార్థుల ప్రతిభ

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన బాలోత్సవ్ చిత్రలేఖన పోటీల్లో తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 11వ తేదీన ఎస్.వి.ఇంజనీరింగ్ కళాశాలలో బాలోత్సవ్ కమిటీ కన్వీనర్లు లక్ష్మీరాజ, రాజశేఖర్‌రాహుల్ జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. జి.వహీదా చిత్రలేఖనం పోటీల్లో ప్రత్యేక బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారు. అలాగే నిఖిత, భార్గవి కూడా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, సావిత్రిబాయిఫూలే అవార్డు గ్రహీత పరిమళాజ్యోతి అభినందించారు.

రూ.60 లక్షలతో హౌసింగ్ బోర్డుకు తాగునీటిని తెప్పించా

ప్రొద్దుటూరు : గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీకి రూ.60లక్షలతో తాగునీటి పథకం మంజూరు చేయించానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. హౌసింగ్ బోర్డులో బుధవారం నూతనంగా నిర్మించిన నీటి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు వాసులు తొలి నుంచి వైఎస్సార్ అభిమానులుగా ముద్రపడ్డారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించినప్పుడు నీటి సమస్యను ప్రస్తావించారని, తన కోటా కింద ఇచ్చిన రూ.20లక్షలతో కలిపి గ్రామ పంచాయతీ నిధులు రూ.40లక్షలతో 12 కిలోమీటర్ల పైపులైన్ నిర్మించామని తెలిపారు. రోడ్డు సమస్య ప్రస్తావించినప్పుడు హౌసింగ్ బోర్డులో 24 గంటల్లో మంజూరు చేయించానన్నారు. కాలనీలోని మూడు ఎకరాల్లో రూ.4.50 కోట్లతో పార్కు అభివృద్ధికి త్వరలో భూమి పూజ చేస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్ కె.దేవిప్రసాదరెడ్డి , సర్పంచ్ గద్ద మోష, ఉపసర్పంచ్ రమాదేవి, వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి, ఎంపీటీసీలు ఓబయ్య యాదవ్, మంజుల వసుంధర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ భరత్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

దస్తగిరి స్వామి పండుగలో ఎమ్మెల్యే

సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఈశ్వర్‌రెడ్డి నగర్ జెండా చెట్టు వద్ద బుధవారం నిర్వహించిన జెండా పండుగలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మాజీ సభ్యుడు అక్బర్, ఉప సర్పంచ్ మార్తల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మైదుకూరు : కడప కొప్పర్తి ఇండస్ట్రియల్ ఏరియాలోని ఎయిల్ డిక్షన్ కంపెనీ జాబ్ మేళా పేరుతో ఇస్తున్న ఉద్యోగ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి అన్నారు. మైదుకూరులో బుధవారం ఎయిల్ డిక్షన్ కంపెనీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా శెట్టిపల్లె నాగిరెడ్డి మాట్లాడుతూ వచ్చిన అవకాశాన్ని పోగొట్టుకోకుండా ఉద్యోగంలో చేరాలని సూచించారు. కంపెనీ బస్సు సౌకర్యం కల్పిస్తుందని, పది, ఇంటర్మీడియట్ చదివిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ చదివిన వారు ఖాళీగా ఉండకుండా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ఉద్యోగంలో చేరాలన్నారు. మైదుకూరు ప్రాంతంలోని నిరుద్యోగులు తమ కంపెనీలో చేరితే మైదుకూరుకు కూడా బస్సు వస్తుందన్నారు. పగలు, రాత్రి రెండు షిఫ్ట్‌ల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. జాబ్ మేళాకు హాజరైన పలువురు నిరుద్యోగులు అధికారులకు దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఎయిల్ డిక్షన్ హెచ్‌ఆర్ నరేష్, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే పొలాల సందర్శన

రాజుపాళెం : మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఓట్ల కోసం పొలాలను సందర్శించారని మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ రెడ్డి అన్నారు. రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో బుధవారం ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పశు పక్షాదులకు కూడా తాగేందుకు నీళ్ల లేవని గుర్తు చేశారు. పర్లపాడు వద్ద ఉన్న స్కీం ద్వారా వెయ్యి ఎకరాలు కూడా పారలేదని, ఓట్ల కోసం కాకుండా సేవా భావంతో చేయాలని వారికి సూచించారు. వర్షాభావంతోనే రైతులు పంటలు సాగు చేయలేదని, దీనికి ప్రత్యామ్నాయంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, అధికారుల కృషితోనే కాలువల్లో పూడికతీత తీయించి రైతులకు నీటిని అందిస్తున్నాం అని చెప్పారు. ఇందులో ఎక్కడా ప్రభుత్వం తప్పిదం లేదని, గత ప్రభుత్వాలు, పాలకులు 20 సంవత్సరాలుగా కాలువల్లో పూడికతీత, జమ్ము తొలగించకపోవడంతోనే నీరు అందలేదన్నారు. ఇప్పుడు వచ్చిన నీటితో మినుము, పత్తి, నూగు, మొక్కజొన్న, జొన్న, పెసర పంటలకు నీటిని అందించడమే కాకుండా బీడు పొలాలకు నీటిని అందిస్తున్నారు. మండల సచివాలయాల కన్వీనర్ వెలవలి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ వరదరాజుల రెడ్డి, కొండా రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, శివశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు.

స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో నామా ఎరుకలయ్య, కమలాక్షమ్మ ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ భగవంతుడిని భక్తి శ్రద్ధలతో పూజించాలని పేర్కొన్నారు. చెడు గుణాలు వదిలేసి సన్మార్గంలో నడవాలని, ఇతరులకు చేతనైన సహాయం చేయాలని సూచించారు. ఉదయం శ్రీకృష్ణునికి, నామా ఎరుకలయ్య, కమలాక్షమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. భగవద్గీత పారాయణం చేశారు. మధ్యాహ్నం ఈశ్వర్‌రెడ్డినగర్‌లోని అమ్మనాన్న మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు.